క్లుప్తంగా

వేడుకగా శాంతి కల్యాణం



శాంతి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

చిట్టమూరు: మండల పరిధిలోని మల్లాం గ్రామంలో స్వయంభు వెలసిన వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామి, అమ్మవార్ల శాంతి కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామివారి మూల విరాట్‌కు అభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణ చేశారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను పలు రకాల పుష్పాలతో అలంకరించి లోక కల్యాణార్థం శాంతి కల్యాణాన్ని వేద మంత్రోచ్ఛరణల నడుమ వేదపండితులు నిర్వహించారు. అలాగే కుజదోషం ఉన్న వారు ఆలయంలో హోమాలు చేశారు. ఈ శాంతి కల్యాణ కార్యక్రమానికి నెల్లూరు, వెంకటగిరికి చెందిన భక్తులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

బాల్య వివాహాలను అరికడదాం



మాట్లాడుతున్న సీడీపీఓ సునంద

సైదాపురం: బాల్య వివాహాలను అరికట్టేందుకు గ్రామీణ ప్రాంత ప్రజలు సహకరించాలని రాపూరు సీడీపీఓ సునంద తెలిపారు. మండల కేంద్రమైన సైదాపురం-1, 2లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్యావివాహాలు, బాలల హక్కులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్ల వయసు వస్తేనే వివాహం చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సౌజన్య, కార్యకర్త రాజమ్మ తదితరులు ఉన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు.

విద్యార్థినికి నగదు పురస్కారం



నగదును అందజేస్తున్న ఉపాధ్యాయుడు వెంకటయ్య

చిట్టమూరు: మండల పరిధిలోని బురదగల్లి కొత్తపాళెం గ్రామానికి చెందిన విద్యార్థిని ఎర్రబోతు ఆశ్రిత పదో తరగతిలో మంచి మార్కులు సాధించడంతో రూ.5 వేలు నగదు పురస్కారం మంగళవారం అందజేశారు. ఇదే గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ఎంసీ వెంకటయ్య ప్రతి సంవత్సరం ప్రభుత్వ స్కూల్లో చదివి టెన్త్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందిస్తున్నారు. అందులో భాగంగానే ఈ విద్యాసంవత్సరంలో 544 మార్కులు సాధించిన ఆశ్రితకు నగదు పురస్కారం అందజేసినట్లు ఉపాధ్యాయుడు వెంకటయ్య తెలిపారు.

కిశోరి వికాసంపై అవగాహన

దక్కిలి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కల్పలత, పరమిళ అన్నారు. మండలంలోని నాయుడుపాళెం, ఎగువలింగసముద్రం, మోపూరురోడ్డు సెంటర్‌లో ఉన్న అంగనవాడీ కేంద్రాల్లో మంగళవారం కిశోరి వికాసంపై సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 11-18 ఏళ్లలోపు బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అంగనవాడీ వర్కర్లు మహిళా పోలీసులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ కేంద్రాల ప్రారంభం



కుట్టుమిషన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సైదాపురం : వెంకటగిరి, సైదాపురం మండలాల్లో మంగళవారం కుట్టు శిక్షణ కేంద్రాలను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు కుట్టు మిషన్ నేర్చుకుని తద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమం అమలు చేస్తోందన్నారు.

తిరుపతి ఐఐటీకి మరిన్ని నిధులు

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరిన్ని నిధులు మంజూరు చేసింది. దేశంలోని తిరుపతి ఐఐటీ, కేరళ రాష్ట్రం పాలక్కాడ్ ఐఐటీ, ఛత్తీస్‌ఘడ్‌లోని భిలాయ్ ఐఐటీ, జమ్మూ ఐఐటీ, కర్ణాటక రాష్ట్రం దార్వాడ్ ఐఐటీలకు 2025-26 నుంచి 2028-29 నాలుగేళ్లకు రూ.11,828.79కోట్లు నిధులు మంజూరు చేసింది. అలాగే అదనంగా 130 ప్రొఫెసర్ స్థాయి బోధనా సిబ్బంది పోస్టులను అదనంగా భర్తీ చేయనుంది. రూ.2,100కోట్లతో తిరుపతి ఐఐటీని మొదటి తరం ఐఐటీగా అభివృద్ధి చేసే లక్ష్యంగా ఇప్పటికే పూర్తిస్థాయి నిర్మాణాలను పూర్తి చేసుకుంది. తిరుపతి ఐఐటీకి ప్రస్తుతం కేటాయించిన రూ.2,100 నిధులతో తిరుపతి ఐఐటీని ప్రపంచస్థాయి వసతులతో అభివృద్ధి చేయనున్నట్లు ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు.

కూటమి పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లూ సంక్షేమ పాలనే
- కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ అమలు చేయకపోవడంతో పేదల పస్తులు
- ప్రతిపక్ష పార్టీ నేతలు, కార్యకర్తలపై కక్ష సాధింపు
- వ్యవస్థల్లో అంతటా అవినీతే
- సాక్షితో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిల్లకూరు: 'ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను నేరుగా అందించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్ల జనంలో నేటికీ సానుకూలత ఉంది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయలేకపోవడంతో పేదలు పస్తులు ఉంటున్నారు. సంక్షేమమే ధ్యేయంగా పాలించిన జగనన్న పాలనకు.. కక్ష సాధింపు ధోరణితో పాటు వ్యవస్థలను నిర్వీర్యం చేయడం.. ప్రతి పనిలో అవినీతి పేరుకుపోయిన ఈ కూటమి ప్రభుత్వానికి నక్కకు నాగలోకం ఉన్నంత తేడా ఉంది' అని ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేరిగ మురళీధర్ అన్నారు. గూడూరులోని సనత్‌నగర్‌లో ఆయన సాక్షికి ఇంటర్వ్యూ ఇచ్చారు. నేటి కూటమి ప్రభుత్వం పట్ల జనంలో మొదలైన భావాలను ఆయన పంచుకున్నారు.

అపార అనుభవం అంటూనే మోసాలు..

రాజకీయాల్లో తనది అపార అనుభవం (40 ఏళ్ల రాజకీయ జీవితం) అని చెప్పే చంద్రబాబు నేడు సంక్షేమాన్ని, పాలనను గాలికి వదలేశారు. నేడు రాష్ట్రంలో రైతులకు గిట్టుబాటు ధరలు లేవు. పెట్టుబడి సాయం అందడం లేదు. నిరుద్యోగులకు కొత్త ఉద్యోగాలు లేవు. ప్రజలకు సేవలందించే వలంటీర్ వ్యవస్థను తొలగించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలులో కూడా మోసమే.

పెడతామంటే ఆశ.. కొడతామంటే భయం

ప్రజలకు పెడతామంటే ఆశ పడతారు.. అదే కొడతామంటే భయపడతారు. అలా ఉంది ప్రస్తుత కూటమి పాలన. ఎన్నికల సమయంలో నవరత్నాల కంటే మెరుగ్గా పథకాలు అందిస్తామని జనాన్ని నమ్మించి ఓట్లేయించుకున్నారు. ఇప్పుడు గద్దె నెక్కిన తరువాత కూటమి నేతలకు దోచుకోవడం.. దాచుకోవడంపైనే దృష్టి పెట్టారు. ఎవరైనా ప్రశ్నిస్తే కేసులు.. బెదిరింపులకు దిగుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

గూడూరు నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టగా ఎన్నికల కోడ్ కారణంగా ఆ పనులు నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నా నిలిచిపోయిన పనులు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయాలనే ఆలోచన చేయడం లేదు. ప్రధానంగా రూ.కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న ఏరియా ఆస్పత్రి, ఇందిరమ్మ కాలనీ వద్ద ఆటోనగర్ ఏర్పాటు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనేలా ఉన్నాయి. రూ.కోట్లు నిధులు వెచ్చించిన అర్బన్ హెల్త్‌సెంటర్‌ను పూర్తి చేయకపోవడం, భవనాలు అందుబాటులోకి తీసుకొచ్చి కూరగాయల మార్కెట్ నిర్వహించకుండా ప్రైవేటు స్థలంలోనే కొనసాగించడం, అసంపూర్తిగా ఉన్న ఆర్‌ఓఆర్ బ్రిడ్జి నిర్మాణంలో కదలిక తీసుకురాకపోవడం, హైవే పక్కనే రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాలను కూటమి నేతలకు కట్టబెట్టేలా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఎక్కడ ప్రకృతి సంపద(గ్రావెల్, మట్టి, సిలికా, ఇసుక, క్వార్ట్జ్ విరివిగా దొరకుతుందో అక్కడ కూటమి నేతలు గద్దల్లా వాలి ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు.

ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా జగనన్న పాలన

సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న ప్రతి నిర్ణయం సంక్షేమంతో ముడిపడి ఉంది. ప్రతి ఇంటికీ నేరుగా సంక్షేమ పథకాలు అందించారు. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా వలంటీర్ వ్యవస్థతో సంక్షేమం, ప్రజారోగ్యాన్ని మరువలేదు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు తీసుకువస్తే.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ వ్యవస్థనే నిర్వీర్యం చేస్తోంది. పింఛన్లు పంపిణీ చేసే ఉద్యోగులుగా మార్చేశారు. ఆరోగ్యశ్రీతో ద్వారా రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందేలా జగనన్న చేస్తే.. కూటమి పాలకులు మాత్రం ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశారు.

హెల్మెట్ వినియోగం తప్పనిసరి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

దక్కిలి: ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని ఎస్‌ఐ శివశంకర్ తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని వెంకటగిరి-రాపూరు జాతీయ రహదారిలోని వెలికల్లు సమీపంలో వాహనాలను తనిఖీ చేసి, అనంతరం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ఆటోవాలాలు అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటోవాలాలు యూనిఫాం, వాహన రికార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు.

గరుడ వాహనంపై కరిమాణిక్య స్వామి



ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న వేదపండితులు



గరుడ వాహనంపై కటాక్షిస్తున్న స్వామి వార్లు

నాయుడుపేటటౌన్ : తుమ్మూరు గ్రామంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్య స్వామి వార్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారు గరుడ వాహనంలో ఆశీనులై పురవీధుల్లో విహరించారు. స్వామివారికి గ్రామస్తులు ప్రతి ఇంటా మంగళహారతి ఇస్తున్నారు. ఉదయం ఆలయం వద్ద స్వామివార్లకు ద్వారదర్శనం ఏర్పాటు చేసి వేదపండితులు అధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయంలో ఉదయం నుంచి సుప్రభాత సేవ, ఆరాధన, సహస్రనామార్చన, బలి హరణం, మధ్యాహ్నం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, రాత్రి ఊంజల్‌సేవ చేపట్టారు. ద్వారదర్శన పూజల్లో ఆలయ మాజీ ట్రస్టీ కామిరెడ్డి రామకృష్ణారెడ్డి, కామిరెడ్డి మోహన్‌రెడ్డి, నరసారెడ్డి, పసల గంగాప్రసాద్, సురేష్‌రెడ్డి, గ్రామస్తులు, ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్లు హరిరెడ్డి, సుధీర్, కరిమాణిక్య స్వామి భక్తులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తుమ్మూరులోని ఎస్‌కేబీఎస్ సత్రంలో బుధవారం నుంచి దేవదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి రవికృష్ణ ఆధ్వర్యంలో బ్రాహ్మణ సమారాధన ప్రారంభించినున్నట్లు తెలిపారు.

నేడు హంసవాహన సేవ

స్వామివార్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఆలయంలో చప్పర ఉత్సవం, రాత్రి స్వామివార్ల హంసవాహన సేవ నిర్వహిస్తున్నట్లు టీటీడీ చెందిన ఆలయ ఇన్‌స్పెక్టర్ హరిరెడ్డి తెలిపారు.

కమనీయం.. చక్రస్నానం



స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు



వసంత నీరు చల్లుతున్న ఆలయ అర్చకులు

చిల్లకూరు : కలవకొండలో వెలసిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. అనంతరం యువతీ యువకులు వసంతోత్సవంతో పాల్గొన్నారు. ఆలయంలో ముందుగా సుప్రభాత సేవ, అనంతరం పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం తిమ్మనగారిపాళెంకు చెందిన బుస్సారెడ్డి రాధాకృష్ణారెడ్డి, సులోచనమ్మ పుష్పాలంకరణకు, చిట్టమూరు శ్రీనివాసులురెడ్డి, ఉమామహేశ్వరి చక్రస్నానానికి, భారీ అన్నదాన కార్యక్రమానికి చిల్లకూరుకు చెందిన కొండా రామచంద్రారెడ్డి, భవానీ ఉభయకర్తలుగా వ్యవహరించారు. సాయంత్రం పుష్పయాగం, ఏకాంత సేవకు ఉభయకర్తలుగా గూడూరు, చినకటువపల్లి గ్రామాలకు చెందిన సోమిశెట్టి రామసుబ్బయ్య, రాజ్యలక్ష్మి, మందపాటి మురళిరెడ్డి, రాధ, జనార్ధనరెడ్డి, అనూష వ్యవహరించారు. కార్యక్రమాలను కలవకొండ యూత్ పర్యవేక్షించారు.

శ్రీవారి సేవలో నెల్లూరు జిల్లా ఎస్పీ



శ్రీవారి ఆలయం వెలుపల నెల్లూరు ఎస్పీ కృష్ణకాంత్

రాపూరు : పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహా స్వామి, ఆదిలక్ష్మిదేవి, ఆంజనేయస్వామిని నెల్లూరు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ కుటుంబసభ్యులతో మంగళవారం దర్శించుకున్నారు. వీరిని దేవస్థాన అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి వేదపండితుల ఆశీర్వచనాలు, ప్రసాదాలు అందించారు.

శ్రీవారి హుండీలో రూ.25 లక్షలు

పెంచలకోన బ్రహ్మోత్సవాల్లో ఏర్పాటు చేసి హుండీ కానుకల లెక్కింపులో రూ.25.51 లక్షలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. బంగారం 38 గ్రాములు, వెండి 2.3 కేజీలు వచ్చినట్లు చెప్పారు. కానుకల లెక్కింపును ఏసీ శ్రీనివాసులురెడ్డి, ప్రత్యేక అధికారి శ్రీధర్‌నాయుడు పర్యవేక్షించారు.

పొగతో దెబ్బతిన్న జామాయిల్ తోట



కాలిపోయిన రోడ్డు పక్కనే ఉన్న జామాయిల్ తోట



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చిట్టమూరు: నాయుడుపేట-మల్లాం రహదారి మార్గంలో కొత్తగుంట సబ్ స్టేషన్ వద్ద చిట్టమూరు పంచాయతీ నుంచి తీసుకొచ్చి పడేసిన చెత్తకు మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. దీంతో పొగ రహదారి వెంబడి కమ్ముకోవడంతో ఆ దారిన వెళ్లే వారు అవస్థలు పడ్డారు. చిట్టమూరు, కొత్తగుంట గ్రామాల్లో దుకాణాల వద్ద ఉన్న వ్యర్థాలను పంచాయతీ పాలకులు చెత్త నుంచి సంపద సేకరణ కేంద్రంలో వేయకుండా నిర్లక్ష్యంగా రోడ్డు పక్కన కుప్పలు పడేశారు. దీంతో ఆ దారిని వెళ్లే వారు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో గాలి తోడవడంతో మంటలు రోడ్డు పక్కన ఉన్న రైతులకు చెందిన జామాయిల్ తోటకు అంటుకుంది. దీంతో జామాయిల్ తోటకు కూడా నిప్పంటుకోవడంతో కాలిపోయింది. కోట అగ్రిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ప్రమాదకరంగా హైవోల్టేజీ విద్యుత్ తీగలు





పెన్నేపల్లి వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

పెళ్లకూరు: నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారి మార్గంలో పెన్నేపల్లి సమీపంలో హైవోల్టేజ్ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉండడంతో వాహన చోదకులు భయపడుతున్నారు. రోడ్డుకు అడ్డంగా హైవోల్టేజ్ విద్యుత్ తీగలు అత్యంత తక్కువ ఎత్తులో ఉండడంతో ట్రాలీ లారీలు, భారీ వాహనాలకు ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల జాతీయ రహదారి పనులు చేపట్టిన ఓ కంపెనీ యాజమాన్యం హైవోల్టేజ్ విద్యుత్ స్తంభాలను ఎత్తు పెంచే క్రమంలో సమీప రైతులతో సఖ్యత కుదరకపోవడంతో ఆ పనులు ఆగిపోయాయి. మరోవైపు జాతీయ రహదారి రోడ్డు విస్తరణ అభివృద్ధి పనుల వల్ల రోడ్డు ఎత్తు పెరిగింది. దీంతో హైటెన్షన్ విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా మారాయి. ఇప్పటికైనా జాతీయ రహదారి అధికారులు, ఏపీ ట్రాన్స్‌కో అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అనుమతుల్లేని భవన నిర్మాణాలు కూల్చివేత



మున్సిపల్ అధికారులు, పోలీసులను అడ్డుకుంటున్న భవన నిర్మాణదారులు



పాగొట్టం కాలనీలో అనుమతులు లేని భవనాలను కూల్చివేస్తున్న అధికారులు

- మున్సిపల్ అధికారులను అడ్డుకున్న భవన నిర్మాణదారులు
- ఒంటిపై పెట్రోలు పోసుకున్న మహిళ
- కోర్టులో కేసు నడుస్తున్నందు వల్లే కూల్చివేశామన్న కమిషనర్

నాయుడుపేటటౌన్: పట్టణంలోని పాగొట్టం కాలనీలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఓ భవన నిర్మాణాన్ని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా సారథ్యంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు మంగళవారం కూల్చివేశారు. అయితే భవన నిర్మాణదారులు అధికారులతో వాగ్వివాదానికి దిగడంతో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. నిర్మాణంలో ఉన్న భవనాలను ఎలా కూల్చివేస్తారంటూ నిర్మాణదారులు కావేరిపాకం రంగయ్య, కృష్ణయ్య కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న సీఐ బాబీ ఘటనా స్థలానికి చేరుకున్నారు. అధికారుల ముందే బాధిత మహిళ ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకునే యత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం అధికారులు అనుమతులు లేకుండా నిర్మించిన నిర్మాణదశలో ఉన్న భవనాలను కూల్చివేశారు. పట్టణంలోని పాగొట్టం కాలనీలో భూములు వెంకటగిరి రాజావారికి సంబంధించినవని కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. ఎన్నో ఏళ్ల నుంచి ఈ భూముల్లో హక్కులు కలిగి ఉన్నామని మరో వర్గం వారు కూడా కోర్టుకు వెళ్లారని కమిషనర్ ఫజులుల్లా తెలిపారు. అయితే ఈ భూములకు సంబంధించి కోర్టులో విచారణ జరుగుతోందన్నారు. గత నెలలో కూడా వీరు భవన నిర్మాణ పనులు చేపట్టినప్పుడు ఆపాలని హెచ్చరికలు జారీ చేశామన్నారు. కానీ వారు తమ ఆదేశాలను లెక్క చేయకుండా నిర్మాణాలు చేస్తుండడంతో వాటిని కూలివేసినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి కోర్టు ఉత్తర్వులు కూడా ఉన్నట్లు ఆయన తెలిపారు.

దిష్టి తగలకుండా బొమ్మ



ఇరుగు దిష్టి.. పొరుగు దిష్టి తగలకూడదని.. తోటల్లో సాగు చేసిన పంటలకు దిష్టి తగలకుండా ఓ రైతు విన్నూతంగా శైలిలో దిష్టిబొమ్మ పలువురిని ఆకట్టుకుంటోంది. సైదాపురం -ఊటుకూరు మార్గ మధ్యలో మామిడి తోటలో ప్రేమికులు కలిసి విచిత్ర వేషధారణలో ఉన్న దిష్టిబొమ్మలను ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారి సైదాపురం-పొదలకూరుకు అటుగా వెళ్లే వారంతా దిష్టి బొమ్మలను వింతగా చూస్తున్నారు.

\- సైదాపురం

మున్సిపల్ కమిషనర్‌కు పదోన్నతి



షేక్ ఫజులుల్లాను సన్మానిస్తున్న సచివాలయ ఉద్యోగులు

నాయుడుపేటటౌన్ : నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లాకు గ్రేడ్-1గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో స్థానిక సచివాలయ ఉద్యోగులు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు శాలువలు కప్పి పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. గ్రేడ్-2 ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తున్న తనకు గ్రేడ్-1 స్థాయి పదోన్నతి రావడం ఆనందంగా ఉందని కమిషనర్ తెలిపారు.

భూసర్వే పరిశీలన

కోట: మండలంలోని ఇలకూరుపాడు రెవెన్యూ పరిధిలో జరుగుతున్న భూసర్వేను మంగళవారం తహసీల్దార్ జయజయరావు పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడారు. భూసర్వేపై వారికి ఉన్న సందేహాలను తెలుసుకుని వాటిపై సమాధానం ఇచ్చారు. మొత్తం 339 ఎకరాల్లో సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులపై గ్రామస్తులకు వివరించారు. భూసర్వే సకాలంలో పూర్తయ్యేలా సహకరించాలని కోరారు. రైతులకు ఉన్న అభ్యంతరాలను తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. మండల సర్వేయర్ గోపిరెడ్డి పాల్గొన్నారు.

కండలేరులో 44.202 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 44.202 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 780, పిన్నేరుకాలువకు 90, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

గూడూరురూరల్: పట్టణంలోని వీరభద్ర స్వామి ఆలయంలో మంగళవారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గూడూరు పట్టణానికి చెందిన గుమ్మడి సుధాకర రావు, ప్రమీలమ్మ, శశిధర్, పూజిత ఉభయకర్తలుగా వ్యవహరించారు. ముందుగా స్వామివారికి పూజలు నిర్వహించారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తనలు

చిల్లకూరు : తాళ్లపాక అన్నమాచార్య జయంతి సందర్భంగా మంగళవారం తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో సంకీర్తనలు ఆలపించారు. ఈఓ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో సిద్ధవరానికి చెందిన సునీల్ బృందం అన్నమాచార్య సంకీర్తనలను ఆలపించారు. ఈఓ మాట్లాడుతూ అన్నమయ్య రచించిన సంకీర్తనల్లో ఎన్నో నిగూఢమైన అర్థాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.